# పప్పూ .... నెయ్యీ .... పసందైన మనుషులు

నాలుగు పద్యాలు చెబితే గొప్పకవిగా తనకుతానే చెలామణి చేసుకుంటారు. కానీ ఒక అద్భుతమైన చంపూగ్రంథాన్ని చెప్పినా తనపేరు చెప్పుకోని 'సుకృతి' ఉన్నారు. ఎవరో తెలుసా? భోజరాజ చరిత్రమనే ఒక మహత్తర గ్రంథమును రచించిన కవీంద్రుడు. ఆయన ఎవరో, ఏ కాలంవాడో ఎక్కడ ఉండేవాడో, చరిత్ర పరిశోధకులకూ తెలియదు. సాహిత్య పత్తేదార్లకు తెలియదు.

అయితేనేం ఆయన చెప్పిన చాలా శ్లోకాలు సూక్తులుగా వాడబడుతున్నాయి. ఆ గ్రంథంలోని చాలా శ్లోకాలు తెలుగులోనికి అనువదింపబడ్డాయి. పేరు తెలియక పోయినా ఆ కవి ఆ చంద్రతారార్కం నిలబడే సత్తాకలవాడు. 'పేరులోన ఏమి పెన్నిధి కలదు' అని ఆరోజుల్లోనే అనుకున్నాడేమో!

భోజరాజ చరితం చాలా తేలికైన సంస్కృత భాషలో వ్రాయబడినది. తెలుగుపద్యం కొన్ని చోట్ల సంస్కృత పదభూయిష్టమై అర్థంకాదేమోకానీ-ఈ సంస్కృతం మాత్రం తెలుగుకంటే తేలిగ్గా తెలిసే సంస్కృతం.

"స్వస్తిశ్రీ శ్రీమన్మహారాజస్య భోజరాజస్య ప్రబన్ధః కథ్యతే" అని ప్రారంభమవుతుంది కథ. భోజుడి తండ్రి సింధులుడు. ఆయనకు లేకలేక ఒక కొడుకు పుట్టాడు అదీ వృద్ధాప్యములో. అతడికి అయిదేళ్ళ వయసొచ్చింది. కొడుక్కి రాజ్యం కట్టబెట్టితే బలవంతుడైన తమ్ముడు మంజుడు ఏం చేస్తాడో కొడుకుని చంపేస్తాడో-రాజ్యం ఆక్రమిస్తాడో అని భయపడ్డంతో ముఖ్యమంత్రిని

పిలిచి విచారించడంతో కథ నడక మొదలు పెడుతుంది. రకరకాలుగా ఆలోచించిన మహారాజు తమ్ముడికే పట్టం కట్టి పెడతాడు. కొడుకుని అప్పగిస్తాడు.

అయితే భోజుడి 'జాతకం' విన్న ముంజుడు అతన్ని చంపాలని వివిధ ప్రయత్నాలు చేస్తాడు. చివరికి బుద్ధి మారి అతడికే రాజ్యం అప్పగిస్తాడు. అక్కడి నుంచి భోజ చరిత్ర మొదలు. 'యథారాజా తథా ప్రజా' అనే మాట తెలుగు నాట సామెతయ్యింది. దాని పూర్తి శ్లోకం ఇది.

రాజ్ఞ ధర్మిణి ధర్మిష్ఠా పాపే పాపపరాః సదా
రాజాన మనువర్తన్తే యథారాజా తథా ప్రజాః

అంటే రాజు ధర్మవంతుడైతే ప్రజలు అలాగే ఉంటారు. రాజు పాపాత్ముడు అయిన అలాగే ఉంటారు రాజెలా ఉంటే ప్రజలూ అంతే.... అని

ఇలాంటి సూక్తి ముత్యాలు కోకొల్లలు.
ఏదైనా చేయాలన్నా ఇవ్వాలన్నా తక్షణమే చేసేసేయాలన్నా. అని చెప్పే శ్లోకం ఇది
అదానస్య ప్రదానస్య కర్తవ్యస్యచ కర్మణః
క్షిప్ర మక్రియ మాణస్య కాలః పిబతి సంపదః

తీసుకోవాలన్నా ఇవ్వాలన్నా అదివెంటనే చేసేయాలి. ఆలాకాక అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అనుకుంటే కాలం ఆ సంపదని మింగేస్తే ఆ మీదట ఇవ్వటం ఉండదు పుచ్చుకోవడము ఉండదు.

మంచి చెప్పేవాడు - వినేవాడు లోకంలో ఉండరు అనే నీతి చెప్పే శ్లోకం చూద్దాం.

సులభాఃపురుషాలోకే సతతం ప్రియవాదినః
అప్రియస్య చ పథ్యస్య వక్తాశ్రోతా చదుర్లభ

కమ్మని కబుర్లు చెప్పేవారు ఎక్కడ పడితే అక్కడ ఉంటారు. అయితే చెప్పేటప్పుడు కష్టంగా ఉన్నా తరువాత మేలుకూర్చే మాటలు చెప్పే వాడు. దాన్నివినేవారు దొరకడం కష్టం.

ఈ భోజరాజు గురించే ఓ తమాషా (శ్లోకం) పద్యం ఉంది. ఎవరో కవి ఒక పాదం రాసుకొని వచ్చాడు. కాళిదాసుని ఆశ్రయించి రాజుగారితో సంభావన ఇప్పించండని అడిగాడు. మిగతాపాదం కవిగారు పూరించి రాజసభా ప్రవేశం చేయించి సన్మానం చేయించారు. ఆ శ్లోకం మొదటి భాగంలో కేవలం ఆశా, అర్థింపు ఉంది. కవిత్వం లేదు. రెండో భాగంలో చక్కని ఊహ ఉంది చూడండి.

భోజనందేహి రాజేంద్ర ఘృత సూప సమన్వితం
మాహిషం చ శరచ్చంద్ర చంద్రికా ధవళం దధి.

ఓ రాజా! భోజనం పెట్టు - పప్పు నెయ్యి కూడా ఉండాలి. ఇదీ అపండితుడికైత. శరత్కాల వెన్నెలలా తెల్లగా ఉండే గేదెపెరుగు ఉండాలి అనేది కాళిదాసు కవిత. పెరుక్కి వేసిన విశేషణంలో ఉంది కవిత్వమంతా !

కువిందుడనే నేతపనివాని కథ మరీ చిత్రంగా ఉంది. కవిత చెప్పే వాడు తప్ప మరొకడు రాజ్యంలో ఉండరాదు.... అంటే కువిందుడు ఒకడే దొరికాడు. రాజును చూసీ చూడగానే కావ్యం కరోమి-నహి చారుతరం కరోమి యత్నాత్ కరోమి యదిచారుతరం కరోమి – భూపాల మౌళిమణిరంజిత పాద పీఠ : హేసాహసాంక కవయామి వయామి యామి. అని కవిత్వం చెప్పాడు. అయ్యా కవిత చెప్తాను అయితే బాగా చెప్పలేను కాసయితే కష్టపడితే బాగా చెప్ప గలనేమో ! ఓ మహారాజా.... కవయామి (కవిత్వం చెప్తా) వయామి (నేస్తా) యామి (వస్తా) అని మూడు ముక్కలు చెప్పేసరికి రాజు పొంగి లొంగిపోయాడు. స్నేహాన్ని గూర్చిన మరోగొప్ప శ్లోకం ఉంది.

స్నేహో హివరమఘటితో నవరం
సంజాత విఘటిత: స్నేహ:
హృతనయనోహి విషాదీ నవిషాదీ భవతి
సఖలు జాత్యంధ:

మైత్రి చేయకుండు టే మేలు. స్నేహం చేసి వదిలేయడం విడిపోవడం మంచిది కాదు కళ్ళుపోయిన వానికి బాధ. కానీ పుట్టు గుడ్డికి అంత బాధ ఉంటుందా? ఎంత చక్కని ఉపమ !

మహారాజు పాలనలో కవులంతా సుఖంగా ఉన్నారు. ఎవడో ఒక కవికి అవకాశం చిక్కలేదు. దానికి రాజుగారు కారణమడిగితే కవి చమత్కారంగా ఎలా చెప్పాడో చూద్దాం.

రాజన్ కనకధారాభిః త్వయి సర్వత్ర వర్షతి
అభాగ్యచ్ఛత్ర సంఛన్నేమయి నాయాన్తి బిందవః

భోజరాజా ! నీవు కనక వర్షాన్ని కురిపిస్తున్నావు. అయితే నేం దుర దృష్టమనే గొడుగు నా తల మీదుంది. ఒక చినుకైనా నా మీద పడ్డం లేదు సుమా!

ఇలా ఎన్నెన్ని కథలు. ఎన్నెన్ని చమత్కారాలు. ఒక్కో కవి రాజ దర్శనానికి వస్తే ఒక్కో చమత్కారం చెప్పాడు. ఒక్కో విశేషం ఒక్కో అద్భుతం. ఓ కవి వచ్చాడు. తన అన్ని కష్టాలకు మూలం దారిద్ర్యం అనే చెప్పుకుంటున్నాడు ఎలా —

అంబా కుప్యతి నమయా, నతయా సా
ఛాపి నాంబయా నమయా
అహ మపి న తయా నతయా వద
రాజన్ కస్య దోషోయం

మా అమ్మకు కోపం వస్తుంది. అందుకు నేను కారణం కాదు. మా ఆవిడా కాదు. మా ఆవిడకు కోపం వస్తుంది. కారణం నాది కాదు మా అమ్మదీ కాదు. అన్నట్టు నేనూ కోప్పడతాను! అందుకు కారణం మా అమ్మా కాదు. మా ఆవిడా కాదు. మరి తప్పంతా ఎక్కడా! ఎవరిది?.... అంటే అన్ని తప్పులకు మూలం దారిద్ర్యం.

ఈ భోజ చరిత్ర స్వారస్యాన్ని మాటలతో చెప్పడం సాధ్యం కాదు. చదివి చూడాల్సిందే....

—o—